వర్షం జోరుగా పడుతోంది. గట్టిగా పెనుగాలి వీచడంతో ఎల్రక్టిక్ దీపాలన్నీ ఒక్కసారిగా ఆరిపోయాయి. సంతపాకల నిండా వర్షం. అంధకార బంధురమైన ప్రకృతిలో అప్పుడప్పుడు మెఱసే మెఱుపులు చీకటి బ్రతుకులు బ్రతికే బిచ్చగాళ్ళకి పట్టెడన్నం దొరికినప్పుడు వాళ్ల కళ్లల్లో వెలిగే ఆనందరేఖల్లా వున్నాయి. పేదవాళ్ళమీద విఱుచుకుపడే ధనవంతుల కఠోర కఠినస్వరంలాగ ఉఱుములు గర్జిస్తున్నాయి, ఆ గర్జనలకి బెదరిపోయి బితుకు బితుకుమంటూ చిట్టి నారయ్య తాత దగ్గిరకి చేరింది.

'వోరారు ?' అన్నాడు నారయ్య వొణికే గొంతుకతో.

'నేను తాతా ! చిట్టిని.'

'నువ్వా తల్లీ ! అన్నయ్య ఇంకా రాలేదా ?'

'లేదు తాతా ! అందుకే భయం వేస్తోంది.'

చిట్టి నారయ్యతాతకి ఇంకా దగ్గరగా చేరింది. నారయ్య తను కప్పుకున్న కంబళీ దానికికూడా కప్పాడు.

'ఈ చీకటి బూచిలావుంది. అన్నయ్య పొద్దున్న వెళ్లి యింకా రాలేదు. నాకు భయం వేస్తోంది తాతా !'

'మనం బిచ్చగోళ్లం. వున్న మారాజులకి మనబాద లేం తెలుస్తాయి తల్లీ ? తలుపేసుకు లోన యెచ్చగా తొంగుంటారు. ఈ వోనలో తడిసి ఈడెడితేవమాత్రం మనోడి గోడు ఆళ్లకి యినిపిస్తదా? ఇంటే మాత్రం పట్టించుకుంట్రా? ఎలక్సన్లప్పుడే మనదెగ్గిర కొస్తారు. ఆతరవోత మన అతీగతీ సూడ్రు. మనబతుకు లింతే తల్లీ !'

చిట్టికి ఈ మాట లేవీ వినిపించడం లేదు. దాని కళ్ళు ఆ అంధకారంలో అన్నగారికోసం ఎదురుచూస్తున్నాయి.

'చిట్టీ!...చిట్టీ!'—చీకటి పిలిచినట్టుయుంది.

'అన్నయ్యా! ఇక్కడున్నా నన్నయ్యా!' ఆ జవాబులో ఆనందం తొణికిసలాడింది.

చీకట్లో తడుముకుంటూ చిట్టి దగ్గరకి వచ్చాడు సూరి.

'భయం వేసిందా అమ్మా! నేను రాలే దవి?'

దీర్ఘ రోగులకు
ఉత్తమ వైద్యము
నపుంసకత్వము, శుక్ల నష్టము, హస్తప్రయోగము, అసంతృప్తి, ఉబ్బసము (దమ్ము), శోధ కాళ్ళు, చెవుడు, కడుపు నొప్పి, కుష్ఠు, బొల్లి, చర్మ వ్యాధులకు పోస్టు ద్వారా కూడా వైద్యము చేయబడును.
శ్రీ శాలాజ వైద్యశాల, డా॥ పి. కుమారస్వామి దేవర, ట. బి. రోడ్, తెనాలి. ఫోన్: 551.
బ్రాంచి : 9—డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17

వాయిదాలలో ట్రాన్సిస్టర 3 BAND

SOUND SALES
ROOP NAGAR
(31) DELHI-7

సరసమైన ధరకి వస్త్రాలు?
ట్విన్ టస్కర్
డ్రిల్‌లు·పాప్లిన్‌లు·గాబర్డీన్‌లు
టస్సూర్‌లు మొదలైనవి
మధుర మిల్స్
మదురై, దక్షిణ ఇండియా
Bensons-1841 A-TEL

విధి వంచితులు

'లేదన్నయ్యా! నారయ్య తాత వున్నాడుగా?'

హఠాత్తుగా మెరిసిన మెరుపులో నారయ్య తాత కళ్ళు తుడుచుకోవడం గమనించాడు సూరి.

పేదవాడి స్నేహితుడు వాడి గుండెల్లో బాధ పంచుకుంటాడు. ధనవంతుడి స్నేహితుడు వాడి సుఖాలనే పంచుకుని కష్టాలలో వదిలేస్తాడు! పేదరికం మనిషిని దేవతగా మారుస్తుంది—ఐశ్వర్యం కొందరిలో మానవత్వాన్ని రూపుమాపి రాక్షసులుగా చేస్తుంది. వున్నవాడి కున్నంతమంది శత్రువులు లేనివాడికి వుండరు. ఉన్నవాడికి చావంటే భయం—లేనివాడికి బ్రతుకంటేనే భయం! ధనవంతుడికి రాత్రంటే భయం—దరిద్రుడికి పగలంటేనే భయం! చీకటి బ్రతుకులు బ్రతికే ఆ పేదవాళ్ళంతా ఆకలి బాధ మరచిపోయి ఆ రాత్రివేళ నిద్రాదేవి ఒడిలో హాయిగా ఒరిగిపోయారు. సంత పాకలన్నీ నిద్ర పోతున్నాయి. కాని సూరి మాత్రం మెళుకువగానే వున్నాడు. ఆకలితో నకనక లాడుతున్న చిట్టి దీనమైన రూపమే అంత చీకట్లోకూడా వాడి కళ్ళ ముందు ఆడుతోంది. ఆలోచనతో వాడి బుర్ర వేడెక్కిపోయింది. వాడి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. వాడి బ్రతుకులాగే యెటు చూసినా చీకటి భయంకరంగా వుంది ఇంతట్లో హఠాత్తుగా ఎలక్ట్రిక్‌లైట్లు వెలిగాయి. ఆ దీవపు వెలుతురులో వాడు చిట్టిని చూశాడు. ఆరేళ్ళ పసిపాప కటిక నేలమీద నారయ్య తాత డొక్కలో దూరిపోయి ఒళ్ళు మఱచి నిద్ర పోతోంది. దాని ముఖం చంద్రబింబంలా వెలిగిపోతోంది.

'ఇది నాకు చెల్లెలుగా పుట్టబట్టే కదా దీనికి ఇన్ని పాట్లు!' అనుకొని ఒక వేడి నిట్టూర్పు విడిచాడు సూరి. వెంటనే వాడి మనస్సు గతాన్ని చీల్చుకుంటూ ఎక్కడెక్కడికో పోయింది.

ఆవేళ చిట్టి పుట్టగానే అమ్మ నిద్ర పోయింది. ఎంత పిలిచినా పలకలేదు. ఇరుగు పొరుగు వాళ్ళందరూ వచ్చి ఒకసారి చూసి వెళ్ళిపోతున్నారు. నాన్న గుండెబాదుకొని యేడ్చాడు, పదిమందీ చేరి అమ్మని ఎక్కడికో తీసుకు పోయారు. పక్కింటి పార్వతమ్మ వచ్చి ఆరోజ్లవాడైన తనని, ఆవేళే పుట్టిన చిట్టిని కనిపెట్టుకుని వుండి నాన్న యింటికి రాగానే వెళ్ళిపోయింది. నాన్న నులక మంచమీద పడి యేడుస్తున్నాడు.

'అమ్మని యెక్కడికి తీసుకు వెళ్ళావు నాన్నా'? అని అడిగాడు తను.

'వొచ్చేస్తుంది బాబూ!'—నాన్న కళ్ళు తుడుచుకుని తనని దగ్గిరకు తీసుకున్నాడు.

'ఎప్పుడొస్తుందీ? అమ్మని ఏం చేశావ్?' మళ్ళీ అడిగాడు తను.

తనని గట్టిగా కౌగిలించుకొని నాన్న గొల్లుమన్నాడు. ఆ గొడవతో తనకు నిమిత్తం లేనట్టు హాయిగా నిద్రపోతోంది చిట్టి.

'ఇది తల్లిని మింగేసింది. నా కనకాన్ని ఇదే చంపేసింది. నా కొంప నిలువునా కూల్చేసింది.' అనేవాడు నాన్న!

తనకి ఇదేమీ అర్థం అయ్యేది కాదు. అర్థం అయిందల్లా ఒకటే – వొస్తుందని నాన్న చెప్పినా అమ్మ మళ్ళీ రాలేదు.

ఒకరోజున ఒక ముసలిది గుమ్మంలో నిలబడి 'అమ్మగారీ యిళ్ళ దరమలో గిళ్ళ – బిచ్చం పెట్టండమ్మా! బిచ్చం' అంటోంది. తను కూడా దానివెనకాలే ఆ మాటలే అనడం నాన్న విన్నాడు.

'ఓరి ముష్టివెధవా! దానితోబాటు నువ్వు కూడా అడుక్కుతింటావ్రటా?' అని కళ్ళు ఎర్ర జేశాడు.

అప్పటి వరకూ యెంతో గారంగా చూసే నాన్న అలా అన్నందుకు తను యెంతో కుమిలిపోయాడు. వెక్కి వెక్కి యేడుస్తున్న తనని ఆ తరవాత బుజ్జగించినా 'ముష్టివెధవా!' అన్న ఆ మాట ఇప్పటికీ తన చెవుల్లో గింగురుమంటూనే వుంది.

* * *

ఉన్న వూళ్ళో పొట్ట గడవక చిట్టినీ తనని తీసుకొని నాన్న నెల్రకితమే పట్నం వొచ్చేశాడు అమ్మ పోయినప్పట్నుంచీ నాన్న విపరీతంగా తాగుడుకి అలవాటు పడి మనస్సుతోపాటు శరీరం కూడా పాడు చేసుకున్నాడు తాగిన మైకంలో యింటికి వచ్చి 'పాపిష్టిదానా! నా కనకాన్ని నువ్వే మింగేశావ్! అంటూ చిట్టిని కసిరి కొట్టేపే

వాడు. ఒకరోజున దాని బాధ చూడలేక తను అడ్డం వెళ్ళాడు.

'దాన్ని చంపెయ్యకు నాన్నా!' అని బ్రతిమాలాడు.

'నేను చంపేవాణ్ణీ—నువ్వు బతికించే వోడివీనా? నువ్వు నాకు సెప్పాలంట్రా? మీ యిట్టం వొచ్చినట్టేడవండి.' అంటూ తూలుతూ ఆవేశంగా బయటికి వెళ్ళిన నాన్న మళ్ళీ రాలేదు. ఒకరోజు గడిచింది. రెండు రోజులు గడిచాయి చిట్టికీ తనకీ భయం వేసింది. గంజి కాచుకుందుకు ఇంట్లో బియ్యం కూడా లేవు. మూడవ రోజున నాన్నని వెతకడానికి తనూ చెల్లెలూ పొద్దుట్నుంచి పట్నం అంతా తిరుగుతూ సాయంకాలం సంతపాకల దగ్గరకి వచ్చారు. అక్కడ వాళ్ళకి పిళ్ళయ్య కనిపించాడు. దిక్కులేని తనన్నీ, చిట్టినీ చూసి జాలి పడ్డాడు. డొక్క పిడతలో మిగిలిన గంజి తెచ్చి ఇద్దరికీ పోశాడు. ఆ గంజితాగి చెల్లెలూ, తనూ అక్కడే పడుకున్నారు. ఆ రాత్రికి నారయ్య తాత కూడా అక్కడికి చేరాడు. తనకథ అంతా విని యెంతో జాలిపడ్డాడు.

'మాతోపాటే నాలుగువీధులు తిరిగితే మీ పొట్ట మీకు గడిచిపోద్ది' అని సలహా యిచ్చాడు.

మరోదారిలేక అందుకు ఒప్పుకొని చిట్టీ, తనూ బిచ్చగాళ్ళుగా మారారు. మొదట్లో ముష్టికి బయల్దేరి నప్పుడు తనకు తల కొట్టేసి నట్టయింది. జోలె

విధి వంచితులు

పుచ్చుకుని పిళ్ళయ్య వెనకాల నిలబడ్డాడు తను. చిట్టి, తనవెనకే నిలబడివుంది. కుంటివాడైన పిళ్ళయ్యకి గుప్పెడు బియ్యం వేసిన పెద్దమనిషి తనని యెగాదిగా చూశాడు.

'సిద్దిలా వున్నావ్—ఇలా వూరిమీద పడకపోతే యేదైనా పనిచేసుకోకూడదూ?' అని వురిమాడు.

'పనివుంటే చేస్తాను – ఇప్పించండి బాబయ్యా!' అన్నాడు తను.

తను నమ్రతగానే అడిగినా ఆయనకి అరికాలిమంట నెత్తికెక్కింది.

'నా మాట నాకే అప్పచెప్తావ్? నీలాంటి దొంగవెధవల్ని యింటికి చేరిస్తే కొంపంతా దోచెయ్యరూ? ఫో! ఫో!' అని గట్టిగా కసిరి లోపలికి వెళ్ళిపోయాడు ఆ యింటివాడు.

ఆ అవమానం భరించలేక మకాము లోకి వొచ్చేశాడు తను.

'అళ్ళు కడుపునిండి నోళ్ళు. అళ్ళకి మనబాదేం తెలుస్తది? అట్టాటోళ్ళు యేదో అన్నారని బాధపడితే మనపొట్ట యెట్టా గడుస్తది?'— సముదాయించాడు నారయ్యతాత.

ఆ మర్నాడు తనూ, చిట్టీ పదివీధులు తిరగ్గాతిరగ్గా అరసోలెడు గింజలు చేరాయి. కసిరినవాళ్ళు కసిరారు. పెట్టినవాళ్ళు పెట్టారు. అప్పటికది కష్టంగానే వున్నా గంజి తాగుతున్నప్పుడు ఆ క్షాత్రం అవన్నీ మరిచిపోయాడు తను.

సిగ్గువిడిచి అలా వీధినిపడ్డా ఒక్కొ రోజున తనూ చిట్టీ పస్తుపడుకోవలసి వస్తోంది

ఎక్కడో కుక్క మొరిగింది. కోడి కూసింది. ఆలోచనలతో సతమత మవు తున్న సూరికి యెప్పుడు నిద్రపట్టిందో వాడికే తెలియదు.

సూరి లేచేసరికే నారయ్య తప్ప తక్కినవాళ్ళంతా వూళ్ళోకి వెళ్ళిపోయారు. వాన వెలిసింది. ఆకాశంనిండా మళ్ళీ మబ్బులు అలముకొంటున్నాయి. ఏక్షణంలో నైనా వర్షం పడేటట్టుంది. నెమ్మకు పోయినచుట్టని వెలిగించే ప్రయత్నంలో వున్నాడు నారయ్య.

'లెగిశావంట్రా సూరీ! సిట్టెమ్మకి ఆకలంటది. తొరగాయెల్లి నాలుగ్గింజ లట్రా.'

'అలాగే తాతా!'

'ఈవోన శనిలా పట్టుకుండది. ఏ నాళ్ళిడిపిస్తదో యేటో!'

'నేనుండగా నీకేటి భయంతాతా? ఇంకో రెండువీధులు తిరిగి నీక్కూడా గింజలు నేనే తెస్తా.'

'నాతండ్రే – నాతండ్రే – యెల్లిరా' అంటూ చింకిచాపమీద నడుం వాల్చాడు నారయ్య.

* * *

'ధర్మం చెయ్యండి బాబయ్యా!'— గుమ్మంలో నిలబడి సూరి దీనంగా అడిగాడు. వాడివెనకాలే చిట్టికూడా అదే పాఠం అప్పగించింది.

'ఎక్కడుందిరా ధర్మం? మాజీతం రాళ్ళు మాకేనాలక ఛస్తూంటే మీక్కూడా ఎక్కడ? పొండి. పొండి.' అన్నదొక గొంతు.

'కుంటివాళ్ళకీ. గుడ్డివాళ్ళకీ అయితే తప్పదు. కళ్ళూ కాళ్ళూ వున్నవాళ్ళు కూడా వొచ్చి కొంపమీద పడితే యెంత మందికి పెట్టగలం?' అంటూ ప్రశ్నించిది మరొక గుమ్మం.

వెంటనే పెద్దెయ్యి అన్నమాటలు సూరి చెవుల్లో మార్మోగాయి.

వో ర్రెరిబాగులోడా! ఇలా యెళ్ళి



అడిగితే నీకొక్కగింజ కూడా రాదు. నామాటిని నువ్వూ నీ సెల్లెలూ కళ్లల్లో గన్నేరిపాలు ఒడిసేసుకోండి. ఆ కళ్లు కూంతా పోతే కడువునిండా కూడే.'

* * *

'అన్నా ! కళ్లూకాళ్లూ వున్నోడి మీద యెవరికీ కనికారం వుండదు. అందుకే నాకళ్లు యిట్టా పోగొట్టు కుండా. మొదట్లో కూంత బాదగానే వుంటది మఱి—' మళ్లీ చెప్పాడు వీరయ్య.

ఆ మాటలు గుర్తుకువచ్చి సూరి అదిరి పడ్డాడు.

'కళ్ళు వుండగానే చూడని యీ మను షులు ఆ కళ్ళు కాస్తా పోయాక చూస్తారని నమ్మకం యేవిటి ? కళ్ళు లేక నారయ్య తాత యెంత బాధపడుతున్నాడో రోజూ చూస్తున్నదే!'

—అనుకుంటూ 'ఆ పసిదాని కళ్ళలోకి చూశాడు సూరి. ఆ కళ్ళు చక్రాల్లా మెరిసిపోతున్నాయి అవి రెండూ పోతే— మరి ఊహించలేకపోయాడు. వాడికి భయం వేసింది

'చెల్లీ!' అని చిట్టిని గట్టిగా కౌగి లించుకున్నాడు. చెల్లెలి ముఖానికి దగ్గరగా తన ముఖం పెట్టి దాని కళ్ళలోకి ఆప్యాయంగా చూశాడు.

మిట్టమధ్యాహ్నం అయింది. ఎన్ని వీధులు తిరిగినా అరసోలడు బియ్యంకన్న యెక్కువ రాలేదు. వాడి కళ్ళల్లో నీళ్లు నిండాయి.

'ఎందుకేడుస్తావన్నయ్యా? ఈ బియ్యం ఈ పూటకి సరిపోతాయిగా ?'

'మరి రాత్రికో ?'

'మనిద్దరం గట్టిగా కౌగలించుకు పడు కుందాం. అప్పుడింక ఆకలెయ్యదు '

'చిట్టీ!' అంటూ చెల్లెల్ని హృదయా నికి హత్తుకొని గొల్లుమన్నాడు వాడు వాడి ఏడుపు చూసి చిట్టి కూడా యేడ్చే సింది

'ఆకలేస్తోందన్నయ్యా !'

సూరికి కడుపు తరుక్కుపోయింది. రాత్రంతా కడుపులో కాళ్ళు పెట్టుకు పడుకోవడంవల్ల అడుగుతీసి అడుగువేసే ఓపిక లేక తోటకూరకాడలా వేలాడి పోతోంది చిట్టి. ఎదురుగా హోటలు కని పించింది. వాడి మెదడులో తళుక్కున యేదో వూహ మెదిలింది. చిట్టిని తీసుకుని ఆ హోటల్లోకి వెళ్ళాడు. సర్వరు ఒక ప్లేటు యిడ్లీ తెచ్చి చిట్టి ముందు ఉంచాడు.

'నువ్వు కూడా తిను అన్నయ్యా!'

'నాకు వొద్దు—నువ్వు తిను.'

చిట్టి ప్లేటు ఖాళీ చేసింది. అన్నా చెల్లెలూ లేచి ముందుకు నడిచారు. ఎదురుగా హోటలు యజమాని కూర్చుని వచ్చేవాళ్ళనీ, వెళ్ళేవాళ్ళనీ వెయ్యి కళ్ళతో చూస్తున్నాడు సూరికి భయం వేసింది. డబ్బు లేకుండా టిఫిను తిన్నందుకు ప్రొప్రయిటరు వాడిని ఈ చెంపా ఆ చెంపా గట్టిగా వాయించేశాడు. 'మూసుకోకుండా అడ్డమయినో వాళ్ళకీ టిఫినిస్తావా ?' అంటూ కొత్తగా చేరిన సర్వరుమీద విరుచుకుపడ్డాడు. ఉద్రేకంతో ఊగిపోతున్న ప్రొప్రయిటర్ని చూడ గానే చిట్టి బెదిరిపోయింది. నిర్దాక్షిణ్యంగా తనని చావగొట్టే తండ్రి దాని కళ్ళలో మెదిలాడు. అది నిలువునా వొణికిపోయింది. హోటలు యజమాని సూరిని రెక్క పట్టు కుని అవతలకు విసిరేశాడు. 'అన్నయ్యా!' అంటూ చిట్టి వాడు వున్నచోటికి ఒక్క గంతు వేసింది. తను దెబ్బలు తిన్నా సరే చిట్టి కడుపు నింపినందుకు వాడు మన సులో సంతోషించాడు.

శాలోఫెన్
బాధానివారిణి మాత్రలు తో
తలనొప్పి, ఫ్లూను వెంటనే నిలిపివేయండి
పంటినొప్పి, ఒళ్లునొప్పులని కూడా
వెంటనే పోగొట్టండి!

బజారులోకి తాజాగా వచ్చిన
శాలోఫెన్ మాత్రలలోని ఔషధాలు
డాక్టర్లు సిఫార్సు చేసేవే!

శాలోఫెన్ ఉన్నచోట బాధ ఉండదు

ఇది అమృతాంజన్
లిమిటెడ్‌వారి
తయారింపే
అని గుర్తు ఉంచుకోండి.

FDS AS 1662 TE

ఆ మధ్యాహ్నం సూరి కాచుకున్న గంజి కాస్తా కుక్క వంచేసింది. తొలి రోజంతా వర్షంలో తడవడంవల్లా, హోటల్లో తిన్న దెబ్బలవల్లా ఒళ్లంతా నొప్పిచేసి రాత్రయే సరికి వాడికి తీవ్రంగా జ్వరం తగిలింది.

ఆ మర్నాడు కూడా వాడు లేవలేదు. ఆ రోజు జోలె పుచ్చుకొని నారయ్యతాతతో చిట్టి బయల్దేరింది. బయలుదేరిన వేళా విశేషం యేమిటో— దానికి బియ్యం దండిగానే దొరికాయి. ఇంకొక్క రెండిళ్లు చూసుకొని తిరుగుముఖం పడదామన్నాడు నారయ్య. ఇంతలో రిక్షా తొక్కుతూ దూరంగా నాన్న కనిపించడంతో చిట్టికి

విధి వంచితులు

పై ప్రాణాలు పైనే యెగిసిపోయాయి. అద్ది నారయ్య చెయ్యి వొదిలించుకొని భయంతో పరుగెత్తింది.

'సిట్టీ! సిట్టెమ్మా!'—నారయ్య అదుర్దాగా పిలుస్తున్నాడు. ఆ పిలుపు దానికి వినిపించడంలేదు.

'చిట్టీ! చిట్టీ!' అంటూ రిక్షా తొక్కుతూ వేగంగా వెంటాడుతున్న తండ్రి పిలుపు దాని గుండెల్లోకి దూసుకుపోతోంది.

'చిట్టీ! ఆగు. ఇన్నాళ్ళు నీకోసమే వెతుకుతున్నాను.' అని అరిచాడు నాన్న.

పరుగెడుతున్న చిట్టి తన వేగం యింకా హెచ్చింది.

'అమ్మా! నే నమ్మా! నాన్నని — మీ నాన్నని. భయం లేదు తల్లీ! ఆగు: మీరు యిల్లువిడిచి వొచ్చేసినప్పట్నించి మీకోసమే వెతుకుతున్నాను. అమ్మా! ఆగు.' అంటూ వెంటాడుతున్నాడు నాగభూషణం.

చిట్టికి ఇవేమీ కనిపించటంలేదు. ఏమీ కనిపించటం లేదు. తనని వెంటాడుతున్నది నాన్న కాదు—ఏదో భయంకర స్వరూపాన్ని చూసినట్టు పారిపోతుంది చిట్టి. నాన్నంటే భయం నరనరాలా పట్టేసింది దానికి నాగభూషణం తన దగ్గరకి వస్తూన్నకొద్దీ చిట్టికి కాళ్ళు తడబడి యెదురుగా వస్తున్న లారీ క్రిందపడిపోయింది. చూస్తూండగా ఆ పసిదాని ప్రాణాలు అనంతవాయువులలో లీనమై పోయాయి. నాగభూషణం కుప్పకూలిపోయాడు.

'అమ్మా! తల్లీ! చిట్టీ; నిన్ను నేను చేతులారా చంపేశానమ్మా! చేతులారా చంపుకున్నాను. మీ అమ్మ చావుకి నువ్వే కారణమని నిన్ను వేధించాను. నీ చావుకి నేను కారణమయ్యాను. తల్లి లేని నీకు తండ్రి ప్రేమ కూడా లేకుండా చేశాను. నిన్ను దిక్కులేని దాన్ని చేశానమ్మా! దిక్కులేని దాన్ని చేశాను! ముక్కుపచ్చలారని ఈ వయస్సులో ముష్టిపిల్లగా తయారు చేశాను. నిన్ను గొడ్డుని బాదినట్టు బాదాను. చివరికి నీ చావుకి నేనే కారణమయ్యాను. నన్ను నువ్వు మనస్సులో యెంతగా శపించావో— ఆ శాపమే యిప్పుడు కడుపు శోకమై నన్ను నిలువుగా దహిస్తోంది తల్లీ! దహించేస్తోంది. నేను తండ్రిని కాను— హంతకుణ్ణి. కన్నబిడ్డని చేతులారా చంపుకొన్న కసాయివాణ్ణి — కాదు— కాదు — కసాయివాడు కూడా కన్నబిడ్డని చంపుకోడు. నేను రాక్షసుణ్ణి. తల్లీ! రాక్షసుణ్ణి'— అంటూ తల బాదుకుంటున్నాడు నాగభూషణం.

ఇంతలో 'సిట్టీ! సిట్టెమ్మా!' అని దారి తడుముకుంటూ నారయ్య తాత లారీ దగ్గరకి చేరాడు. అప్పటికే పదిమందీ మూగారు. జరిగినది తెలిసి ఆ అంధుడు నేలమీద కూలబడిపోయాడు. కొంతసేపటికి పోలీసులు వొచ్చి చిట్టిని శవపరీక్షకి తీసుకు పోయారు. ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు—

చిట్టి కోసం తన కంటే కూడా యెక్కువగా యేడుస్తున్న నారయ్యని చూసి 'ఎవరు బాబూ! నువ్వు?' అన్నాడు నాగభూషణం.

'నేను సిట్టికి తాతని నువ్వోరు బాబూ?' —ఆ ముసలిగొంతు వొణికి పోయింది.

నారయ్యతోపాటు నాగభూషణం సంతపాకల దగ్గరకి చేరుకున్నాడు. జ్వరం అంతా ఏమయిపోయిందో యేమో— 'నాన్నా!' అంటూ యెదురుగా వచ్చి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు సూరి.

'బాబూ!' అని యేకధారగా యేడ్చాడు ఆ కన్నతండ్రి. ఇంతకాలమూ విడిపోయినందుకు తండ్రి విలపిస్తున్నాడనుకొన్నాడు కొడుకు.

'చిట్టి యేది తాతా?'—పక్కకి తిరిగి అడిగాడు సూరి. శవంలా అయిపోయాడు నారయ్యతాత.

'బాబూ! చిట్టిని నా పొట్టని పెట్టుకున్నాను రా! నేను తండ్రిని కాను — రాక్షసుణ్ణి' అంటూ గుండె బాదుకుని యేడ్చాడు నాగభూషణం.

సూరి నిర్జీవ ప్రతిమలా అయిపోయాడు. సంతపాకలన్నీ ఒక్కసారి గొల్లుమన్నాయి.

'బాబూ!' అని కొడుకుని పట్టుకొని బావురుమన్నాడు నాగభూషణం. ●

గృహిణుల సుఖసంతోషాలకు టెస్లా

లోతు బావులకు ప్రత్యేకముగా రూపొందించబడిన ½ H.P. సింగిల్ ఫేజ జెట్ పంపు సెట్టు, సక్షన్ 70 అడుగులు, డెలివరి 65 అడుగులు. ఎట్టి సమస్యలు లేకుండ సునాయాసముగా నీటిని సరపరా చేయును.

High Pressure Water System

మెసర్స్ శ్రీ శంకర్ ఫౌండ్రి & ఇంజనీరింగ్ వర్క్సు,
B-7, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చిత్తూరు (ఏ.పి)
ఇండియా అంతట ప్రతినిధులు లేనిచోట్లలో యేజంట్లు కావలెను.